సాక్షి
జనగామ
బుధవారం । 26 । జూలై । 2023



కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేయడాన్ని హర్షిస్తూ వీఆర్ఏ సంఘం నాయకులు సీఎం కేసీఆర్ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు.

- 9లో▸



మోదీ బాధ్యత వహించాలి

మణిపూర్‌లో జరుగుతున్న అల్లర్లకు పీఎం మోదీ బాధ్యత వహించాలని సీపీఐ నాయకులు అన్నారు.

- 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.0^{0} /24.0^{0}

జిల్లాలో ఉపరితల ఆవర్తన ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

న్యూస్‌రీల్

మొక్కలు నాటండి

అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్



లింగాలఘణపురం: వర్షాకాల సీజన్ పూర్తి కాక ముందే గ్రామాలకు నిర్ణయించిన మొక్కలు నాటే లక్ష్యాలను పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని నవాబుపేటలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. అదనపు కలెక్టర్‌తో పాటు డీఆర్‌డీఓ రాంరెడ్డి, ఎంపీడీఓ సురేందర్, ఈసీ మోహన్ తదితరులు ఉన్నారు.

నాణ్యమైన ఆహారాన్ని అందించాలి

నర్మెట: అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రఫుల్ దేశాయ్ అన్నారు. మండలంలోని బొమ్మకూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేసిన ఆయన గుడ్లు, నిత్యావసర సరుకులు, పౌష్టికాహార పదార్థాలను, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట డీఆర్డీఓ, ప్రాజెక్ట్ డైరెక్టర్ గూడూరు రాంరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రజిత, ఎంపీడీఓ ఎండీ. ఖాజామొయిఉద్దీన్, సర్పంచ్ శంకర్‌నాయక్ తదితరులున్నారు.

అదనపు కలెక్టర్ బదిలీ

జనగామ రూరల్: జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ బదిలీ అయ్యారు. ఈ మేరకు చీఫ్ సెక్రటరీ శాంతికుమారి మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. గత ఏడాది నవంబర్ 9వ తేదీన బాధ్యతలు చేపట్టిన ఆయన 8 నెలల పాటు జిల్లాలో పనిచేశారు. స్థానిక సంస్థల పరిపాలనలో తనకంటూ ఓ ప్రత్యేకతను చాటుకున్న ప్రఫుల్ దేశాయ్.. కరీంనగర్‌కు లోకల్ బాడీ అదనపు కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్నారు.

గ్యాస్ ప్లాంట్ పనుల పరిశీలన

లింగాలఘణపురం: మండలంలోని నెల్లుట్ల ఉన్నత పాఠశాల సమీపంలో నిర్మిస్తున్న గోబర్ గ్యాస్ ప్లాంట్ పనులను మంగళవారం డీపీఓ రంగాచారి పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేసి మధ్యాహ్న భోజన వంటలకు అందించాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసు రెడ్డి, నాయకులు చిట్ల భూపాల్‌రెడ్డి ఉన్నారు.

రక్త నమూనాల సేకరణ

తరిగొప్పుల: జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు మండలకేంద్రంలోని పలు టీబీ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యుల నుంచి మంగళవారం రక్త నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా టీబీ వ్యాధి నివారణ జిల్లా కోఆర్డినేటర్ మధు శ్రీ మాట్లాడుతూ ముందస్తుగా టీబీ పరీక్షలు చేయించుకుంటే చికిత్స పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ చంద్రారెడ్డి, ఏఎన్ఎం వసంతరాణి, ఆశ వర్కర్లు ప్రేమలత, శారద పాల్గొన్నారు.

వరి సాగులో వెదజల్లే పద్ధతి మేలు



డీఏఓ వినోద్‌కుమార్

జనగామ: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న జోరు వర్షాలతో నేరుగా విత్తుకునే వరి సాగు మేలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమయంలో నార్లు పోసుకునే సమయం దాటి పోయిందని, నేరుగా విత్తుకునే అవకాశం ఉందన్నారు. దమ్ము చేసిన పొలంలో మొలకెత్తిన విత్తనాలు వెదజల్లడం లేదా డ్రమ్ సీడర్‌తో విత్తుకోవడం సులభమైన మార్గమన్నారు. వెదజల్లే పద్ధతిలో ఎకరాకు 8 నుంచి 10 కిలోల విత్తనం చల్లుకుంటే సరి పోతుందన్నారు. డ్రమ్ సీడర్ అయితే 10 నుంచి 15 కిలోల విత్తనం సరిపోతుందన్నారు. అధిక వర్షాలతో విత్తనం కొట్టుకుపోయే అవకాశం ఉండడంతో వానలు ఆగిన తర్వాత విత్తనం వేసుకోవాలని సూచించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని తెలిపారు.

ఎమ్మెల్యేగా బరిలో ఉంటా..

ఆప్కో మాజీ చైర్మన్ మండల శ్రీరాములు

బచ్చన్నపేట: జనగామ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ తరఫున సీఎం కేసీఆర్ చొరవతో ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉంటానని ఆప్కో మాజీ చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు మండల శ్రీరాములు అన్నారు. మంగళవారం మండలంలోని వంగ సుదర్శన్‌రెడ్డి నగర్‌లో పలువురు నాయకులతో కలిసి మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో జనగామ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ప్రజల ఆదరణతో గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ మూడో సారి సీఎం కావడం ఖాయమన్నారు. శ్రీనివాస్, నర్సయ్య, ప్రభాకర్, రవి తదితరులు ఉన్నారు.

కుండపోత



జఫర్‌గఢ్: కోతకు గురైన కూనూరు-గర్మిళ్లపల్లి రోడ్డు



లింగాలఘణపురం: మత్తడి పోస్తున్న వనపర్తి చెరువు



చిల్పూరు: ఇంటిలోకి వచ్చిన నీటిని ఎత్తిపోస్తున్న మహిళ

జిల్లావ్యాప్తంగా దంచికొట్టిన భారీ వర్షం

- రెండు రిజర్వాయర్ల గేట్లు ఎత్తివేత
- మత్తళ్లు పోస్తున్న 288 చెరువులు
- దెబ్బతిన్న రహదారులు, పంటలు
- కల్వర్టులపై వరద ఉధృతి
- మరో మూడురోజులు అలర్ట్
- అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

జనగామ: ఉపరితల ఆవర్తన ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా సోమవారం రాత్రి నుంచి కుండపోత వర్షం కురిసింది. జనగామ పట్టణంతో పాటు జఫర్‌గఢ్, స్టేషన్‌ఘన్‌పూర్, తరిగొప్పుల, నర్మెట, రఘునాథపల్లి, బచ్చన్నపేట, దేవరుప్పుల, లింగాలఘణపురం మండలాల్లో మోస్తారు వర్షం కురిసింది. పలు గ్రామాల్లో కుంటలు, చెరువులు మత్తళ్లు పోస్తున్నాయి. వరద ఉధృతికి రాకపోకలకు తీవ్ర ఆటంకం కలిగింది. జనగామ మండలం చీటకోడూరు రిజర్వాయర్‌కు 100 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, నాలుగు గేట్లు పైకి ఎత్తి అంతే మొత్తంలో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. గండిరామవరం రిజర్వాయర్‌కు 100 క్యూసెక్కుల నీరు వచ్చే క్రమంలో, రెండు గేట్లు తెరిచి, అంతే మొత్తంగా దిగువకు పంపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 288 చెరువులు, కుంటలు మత్తళ్లు పోస్తుండగా, 229 చెరువులకు 75 నుంచి 100 శాతం వరకు నీటి నిల్వలు పెరిగాయి. చీటకోడూరు రిజర్వాయర్ వద్ద వరద ఉధృతిని ఇరిగేషన్ ఎస్ఈ సుధీర్, డీఈ రవి తదితరులు పరిశీలించారు.

నిలిచిన రాకపోకలు

జఫర్‌గఢ్: రికార్డు స్థాయిలో కురిసిన భారీవర్షంతో చెరువులు, కుంటలు నిండి, మత్తళ్లు పోస్తూ, కల్వర్టులు, రహదారులను ముంచేస్తున్నాయి. వరద తాకిడితో కూనూరు– ఉప్పుగల్లు– గర్మిళ్లపల్లి, కోనాయచలం –తమ్మడపల్లి గ్రామాల మధ్య బీటీరోడ్డు కోతకు గురి కాగా, బోళ్ల మత్తడి వద్ద నిర్మాణంలో ఉన్న కెనాల్ ప్రాంతంలో వరద నీరు రోడ్డును ముంచేయడంతో రాకపోకలు నిలిచి పోయాయి. అలాగే సూరారం రహదారి పలుచోట్ల దెబ్బతినగా, ఓబులాపూర్ నుంచి జఫర్‌గఢ్‌కు వెళ్లే ప్రధాన రహదారి కల్వర్టు వద్ద వరద ఉధృతితో ప్రయాణాలు వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈదురుగాలులతో రాత్రి 8 గంటల నుంచి మంగళవారం మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అలాగే భారీ వర్షాలతో రఘునాథపల్లిలోని ఇబ్రహీంపూర్ మత్తడి ఉధృతితో పాత గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి.

చెరువుల్లో నీటిమట్టం వివరాలు

25 నుంచి 50 శాతం నిండినవి	151
50 నుంచి 75 శాతం	129
75 నుంచి 100 శాతం	229
మత్తుళ్లు పోస్తున్న చెరువులు	288

మొత్తం చెరువులు: 797

రిజర్వాయర్లలో నీటి మట్టం వివరాలు (మీటర్లలో)

రిజర్వాయర్	సామర్థ్యం	ప్రస్తుతం
గండిరామవరం	422	422
బొమ్మకూరు	475	471.00
చీటకోడూరు	389	389
నవాబుపేట	328.800	324.500
ఘన్‌పూర్	338.215	336.250
అశ్వరావుపల్లి	400	394.800
మైలారం	250.500	249.100

రెండు రోజుల్లో 1,440 మిల్లీమీటర్ల వర్షపాతం

జిల్లాలో రెండు రోజుల్లో 1,440 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 320.0, 24వ తేదీ నుంచి 25 ఉదయం 7 గంటల వరకు 1,132 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. అత్యధికంగా జఫర్‌గఢ్‌లో 160 మిల్లీ మీటర్లు, స్టేషన్‌ఘన్‌పూర్లో 142.2 మి.మీ, తరిగొప్పులలో 84.2 మి.మీ, చిల్పూరులో 79.8 మి.మీ, రఘునాథపల్లిలో 80.2 మి.మీ, నర్మెటలో 90.0 మి.మీ, జనగామలో 58.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయిందని అధికారులు తెలిపారు.

నష్టం అంచనా

జిల్లాలో ఒక ఇళ్లు పూర్తిగా కూలి పోగా 48 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. 12 చోట్ల రహదారులు, బ్రిడ్జి, కల్వర్టు కోతకు గురయ్యాయి. ఒక ఆవు మృతి చెందింది.



జఫర్‌గఢ్ శివారులో నల్లబండ కల్వర్టు మీదుగా ప్రవహిస్తున్న వరద నీరు

- మరిన్ని ఫొటోలు 9లో▸



మల్లన్నగండి రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ శివలింగయ్య, అధికారులు

అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ శివలింగయ్య

నర్మెట: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య అన్నారు. మండలంలోని వెల్దండ, గండిరామారం మల్లన్నగండి రిజర్వాయర్లను అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించిన ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. రిజర్వాయర్ రెండు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. ఆయన వెంట అడిషనల్ కలెక్టర్ బి.రోహిత్ సింగ్, తహసీల్దార్ పారునంది శ్రీనివాస్, ఆర్ఐ సాయిబాబు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



బచ్చన్నపేట: మండలంలో నీటమునిగిన పత్తి పంట



స్టేషన్‌ఘన్‌పూర్: తానేదార్‌పల్లిలో ఇసుకమేట వేసిన వరిపొలాలు

అధికారుల పరిశీలన

స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో అనేక గ్రామాల్లో చెరువులు మత్తళ్లు దూకుతుండడంతో వరి పంటకు తీవ్ర నష్టం జరిగింది. నాట్లు, నార్లు కొట్టుకు పోయాయి. నమిలిగొండతో పాటు 17 చోట్ల మత్తడి వరద రోడ్డుపై పొంగి పొర్లు తుండడంతో రాకపోకలు స్తంభించిపోయాయి. తాత్కాలిక రోడ్డు పనులను రెవెన్యూశాఖ అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ పరిశీలించారు. అలాగే కోడూరు నుంచి రామన్నగూడెం వెళ్లే కల్వర్టుపై వాగు ఉధృతికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. జనగామ ఆర్డీఓ మురళీకృష్ణ, ఎండీ అన్వర్ పరిస్థితిని పరిశీలించి ఆయా గ్రామాల ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



జనగామ రూరల్: చీటకోడూరు రిజర్వాయర్ వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న ఇరిగేషన్ ఎస్ఈ సుధీర్, డీఈ రవి



నమిలిగొండలో పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



జఫర్‌గఢ్: చెరువును తలపిస్తున్న ఉప్పుగల్లు, కూనూర్ మధ్య రహదారి



జనగామ-హైదరాబాద్ రోడ్డుపై నిలిచిన వరద నీరు

మీనం.. ఘనం..
- వేర్వేరు చోట్ల వలలకు చిక్కిన పెద్ద చేపలు

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, సీపీ, ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్

మత్తళ్లు.. పరవళ్లు
- నిండుకుండలా చెరువులు

8లో

సీఎం కలలు నిజమయ్యాయి

- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

బచ్చన్నపేట: కరువుకు కేరాఫ్‌గా ఉన్న బచ్చన్నపేట మండలం నేడు జలకళతో కళకళలాడుతుందని, సీఎం కేసీఆర్ కలలు నిజమయ్యాయని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పెద్ద వాగుపై నిర్మించిన చెక్ డ్యాంలను పరిశీలించారు. మత్తళ్లు పోస్తున్న చెక్ డ్యాంల వద్ద సంతోషంతో నినాదాలు చేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం కేసీఆర్ చొరవతోనే ఈ ప్రాంతం సస్యశ్యామలం కావడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. పేద ప్రజల బాధలు తెలియని పలు పార్టీల నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, అలాంటి నాయకులకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. బచ్చన్నపేట మండలంలో ఇప్పటి వరకు 2,100 దరఖాస్తులు డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చినాయని నియోజకవర్గంలోని అందరికీ డ్రైవింగ్ లైసెన్స్‌లను ఇప్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బొడిగం చెంద్రారెడ్డి, ఎంపీటీసీ మామిడి అరుణ, వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, సర్పంచ్‌లు గట్టు మంజుల, మాసపేట రవీందర్‌రెడ్డి, నాయకులు షబ్బీర్, జావిద్, బాలచందర్, మహేందర్‌రెడ్డి, సిద్దారెడ్డి, కిష్టయ్య, అయిలయ్య, భాస్కర్, జూల కృష్ణ, మల్లేశం, గద్ద రాణి తదితరులు పాల్గొన్నారు.



పోచన్నపేట చెక్ డ్యాం వద్ద నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే

మణిపూర్ దుండగులను శిక్షించాలి

- జనగామలో క్రైస్తవుల భారీ ర్యాలీ

జనగామ: మణిపూర్‌లో మహిళలను అత్యాచారం చేసి, దారుణంగా ప్రవర్తించిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరుతూ మంగళవారం క్రైస్తవ సంఘాలు, పాస్టర్స్ ఆధ్వర్యంలో స్థానిక ఉండ్రుపుర సెంటినరీ బ్యాప్టిస్ట్ చర్చి నుంచి రైల్వే స్టేషన్, అక్కడ నుంచి కలెక్టరేట్ వరకు ప్లకార్డులతో భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. క్రైస్తవ ప్రముఖులు మాట్లాడుతూ దేశంలో క్రైస్తవులపై దాడులు పెరిగి పోతున్నాయన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే విధంగా కొన్ని రాజకీయ శక్తులు దేశం మొత్తంగా పని చేస్తున్నాయన్నారు. హిందూ, ముస్లిం, క్రైస్తవులు భారత దేశంలో కలిసి జీవిస్తున్నారనే విషయం ఆ పార్టీలకు తెలియడం లేదన్నారు. చర్చిలు, ఆస్తులు, ఇళ్లను సైతం ధ్వంసం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దుండగులను వెంటనే అరెస్ట్ చేసి, క్రైస్తవుల హక్కులను కాపాడాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ శివలింగయ్యకు అందించారు. ఈ కార్యక్రమంలో ఉండ్రుపుర సెంటినరీ బ్యాప్టిస్ట్ చర్చి ప్రెసిడెంట్ కర్రోల్ల జాన్, సెక్రటరీ బక్క శ్రీను, పసుల ఏబేలు, కార్యవర్గ సభ్యులు డాక్టర్ పి.ఫిలిప్, జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొంగరి మోజెస్ కుమార్, ఫీల్డ్ ప్రెసిడెంట్ శాగ దేవదానం, నల్ల జాన్, నర్సింగరావు, ప్రభాకర్, ఇన్నారెడ్డి, నవీన్ కుమార్, డాక్టర్ ఇన్నమ్మతో పాటు జిల్లాలోని ఆయా సంఘాల దైవ జనులు పాల్గొన్నారు.



జనగామలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

జీపీ సిబ్బంది వినూత్న నిరసన

రఘునాథపల్లి: న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గ్రామ పంచాయతీ కార్మికులు ఉరితాళ్లతో వినూత్నంగా నిరసన తెలిపారు. మండల పరిషత్ వద్ద జీపీ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఉమ్మగోని రాజేష్ ఆధ్వర్యంలో చేపట్టిన పంచాయతీ కార్మికుల సమ్మె మంగళవారం నాటికి 20వ రోజుకు చేరింది. సీఐటీయూ మండల బాధ్యుడు పొదల నాగరాజు సమ్మెకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో నల్ల రాజయ్య, కొయ్యడ భిక్షపతి, బుస్సారి సత్యనారాయణ, ఎండీ యూసుఫ్‌మియా, భాస్కర్, రాపోలు రాజ్‌కుమార్, పర్ష రాములు, రమేష్, మల్లేశం, యాదగిరి, ఎల్లయ్య, దామోదర్, వెంకటేష్, రవి, నీలం మోహన్ తదితరులు ఉన్నారు.



నిరసన తెలుపుతున్న జీపీ సిబ్బంది

అంగన్‌వాడీ కేంద్రం సందర్శన



మాట్లాడుతున్న మనోరమ

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి. మనోరమ మంగళవారం సందర్శించారు. సాక్షిలో 'అంగన్‌వాడీలో కుళ్లిన గుడ్లు' అనే కథనానికి అధికారులు స్పందించారు. కోడిగుడ్లను ప్రభుత్వమే నేరుగా కేంద్రాలకు సరఫరా చేస్తున్నారని, అందులోనే కుళ్లిన గుడ్లు వచ్చాయని, వాటి స్థానంలో నూతన గుడ్లను సరఫరా చేస్తామన్నారు. మరో మారు ఇలాంటి ఘటన జరగకుండా చూస్తామన్నారు.

దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతు

- ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య

జఫర్‌గఢ్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పేర్కొన్నారు. మండలంలోని కూనూర్ గ్రామ శివారులో భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్డును ఎమ్మెల్యే రాజయ్య మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా భారీ స్థాయిలో కోతకు గురైన రహదారిని పరిశీలించిన అనంతరం వరద ఉధృతి పరిస్థితులను తెలుసుకున్నారు. దెబ్బతిన్న తాత్కాలిక మరమ్మతులు చేపట్టేందుకు సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లెపాటి జైపాల్‌రెడ్డి, పసునూరి మహేందర్‌రెడ్డి, నెల్లుట్ల అజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పాఠశాలలకు రెండు రోజులు సెలవులు

జనగామ రూరల్: రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ అన్ని పాఠశాలలకు రెండు రోజుల పాటు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని డీఈఓ కె.రాము మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 26, 27వ తేదీల్లో పాఠశాలలకు సెలవు ఉంటాయన్నారు.

మత్తళ్లు..పరవళ్లు

హన్మకొండ: మత్తడి పోస్తున్న భద్రకాళి చెరువు



కురవి : అలుగు పోస్తున్న నల్లెల్ల చెరువు



నర్సింహులపేట : కొమ్ములవంచలో మత్తడి పోస్తున్న కొత్తచెరువు



ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు, మూడు రోజుల నుంచి కుండపోత వర్షం కురుస్తోంది. దీంతో ఇంత కాలం నెర్రలు బారిన చెరువులు, కుంటలు మత్తళ్ల పరవళ్లు దూకుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఫలితంగా కనుచూపు మేర నీరే కనిపిస్తోంది. కాగా, మత్తళ్ల వద్ద ప్రజలు చేపలు పడుతుండడంతో ఆ ప్రాంతంలో సందడి నెలకొంటుంది.

\- సాక్షి నెట్‌వర్క్

ఉమ్మడి జిల్లాలో కుండపోత వర్షం..

- అలుగు పోస్తున్న చెరువులు, కుంటలు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు



కాజీపేట : సోమిడిలో పొంగిపొర్లుతున్న ఊర చెరువు

దేవరుప్పుల: మత్తడి పోస్తున్న కదవెండి వాగు





దామెర : మత్తడి పోస్తున్న దామెర గిద్దె చెరువు



నర్సంపేట రూరల్ : మత్తడి పోస్తున్న మాదన్నపేట చెరువు



అలుగుపోస్తున్న మానుకోటలోని నిజాం చెరువు



గంగారం : గంగారంలో మత్తడిపోస్తున్న చెరువు



శాయంపేట : అలుగుపోస్తున్న చలివాగు



సంగెం : మత్తడి పోస్తున్న ఎల్గూర్‌రంగంపేట చెరువు



మహబూబాబాద్‌లోని జమండ్లపల్లి వద్ద మున్నేరు వాగు..



సంగెం : మత్తడి పోస్తున్న కుంటపల్లి చెరువు

మీనం.. ఘనం..

- వేర్వేరు చోట్ల వలలకు చిక్కిన పెద్ద చేపలు

చిల్పూరులో 12 కిలోల పాపర చేప..



పాపర చేపతో లింగయ్య

చిల్పూరు: జనగామ జిల్లా చిల్పూరు మండల కేంద్రంలోని ఆకేరు వాగు చెక్ డ్యాం వద్ద మంగళవారం సాయంత్రం 12 కిలోలు ఉన్న పాపర చేప వలకు చిక్కింది. గ్రామానికి చెందిన దామెర లింగయ్య చెక్‌డ్యాం వద్ద వల వేయగా ఈ చేప చిక్కింది. దీనిని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

చిన్నోడికి చిక్కిన పెద్ద చేప..



చేపను చూపుతున్న యశ్వంత్

చెన్నారావుపేట: చెన్నారావుపేట శివారులోని కోపాకుల చెరువు మంగళవారం మత్తడి పోయగా ప్రజలు చేపల వేటకు వెళ్లారు. ఇదే గ్రామానికి చెందిన రాకం యశ్వంత్ కూడా వెళ్లాడు. అక్కడ ఈ చిన్నోడి వలకు పెద్ద చేప చిక్కింది. దీంతో ఆ బుడతడి ఆనందానికి అవధులు లేకుండాపోయింది. మండల కేంద్రానికి తీసుకొచ్చి విక్రయించాడు. 10 కిలోలు ఉండడంతో రూ. 1000 విక్రయించాడు. చిన్నోడికి అదృష్టం కలిసొచ్చిందని పలువురు చర్చించుకోవడం విశేషం.

జంగాలపల్లిలో 6 కిలోల వాలుగ..



వాలుగతో పవన్

ములుగు: ఇటీవల కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఈ క్రమంలో ములుగు మండలం మేడివాగు వద్ద ప్రజలు మంగళవారం చేపలు పట్టారు. ఇందులో జంగాలపల్లి గ్రామానికి చెందిన పవన్ వలకు 6 కిలోల వాలుగ చిక్కింది.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

సాక్షి ప్రతినిధి, వరంగల్: వర్షాలు, వరదలపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నమోదవుతున్న వర్షపాతం, వరదలు, లోతట్టు ప్రాంతాల జలమయం, వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అత్యవసర పరిస్థితుల్లో, రెస్క్యూ టీమ్స్, టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు తదితర అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు, సీపీ, ఎస్పీలు, ఇతర అధికారులతో మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల పరిస్థితి, ముందు జాగ్రత్త చర్యలను కలెక్టర్లు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో గల జిల్లాల్లో రెడ్ అలెర్ట్ ఉందని, ప్రజలకు ఏ సమస్య ఉన్నా అధికారులకు తెలపాలన్నారు. ఏ సమయంలో ఏ సమస్య వచ్చినా వెంటనే అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అలాగే, జిల్లా కలెక్టరేట్లలో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివస్తున్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. కాగా, 2 రోజులుగా కురుస్తున్న వర్షాలపై ఆరా తీసిన మంత్రి.. అధికారులు అందుబాటులో ఉండాలని చెప్పారు. ఇదే సందర్భంలో తాను కూడా సహాయక చర్యలలో పాల్గొంటున్నానని, ప్రజాప్రతినిధులు, యువత కూడా అధికారులకు సహకరించాలని కోరారు.



ఉమ్మడి వరంగల్ కలెక్టర్లు, ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి ఎర్రబెల్లి

పోలీస్ అధికారుల బదిలీ

- ఇన్‌స్పెక్టర్లు 19 మంది.. సబ్ ఇన్‌స్పెక్టర్లు 14 మంది
- ఉత్తర్వులు జారీ చేసిన వరంగల్ సీపీ ఏవీ. రంగనాథ్

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 19 ఇన్‌స్పెక్టర్లు, 14 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ వరంగల్ పోలీస్ కమిషనర్ రంగనాథ్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

ఇన్‌స్పెక్టర్లు..

డి.మల్లేష్ ఇంతేజార్‌గంజ్ నుంచి శాయంపేట సర్కిల్, బి.శ్రీనివాస్‌రావు శాయంపేట సర్కిల్ నుంచి వీఆర్ వరంగల్, టి.సురేష్ ఖమ్మం కమిషనరేట్ నుంచి మిల్స్‌కాలనీ, ముస్కే శ్రీనివాస్ మిల్స్‌కాలనీ నుంచి ఇంతేజార్‌గంజ్, కె.శ్రీధర్‌రావు సీఎస్‌బీ వరంగల్ నుంచి ధర్మసాగర్, ఎ.రాఘవేందర్ స్టేషన్ ఘన్‌పూర్ నుంచి సీఎస్‌బీ వరంగల్, సొట్ల రాజు వీఆర్ వరంగల్ నుంచి స్టేషన్‌ఘన్‌పూర్, ఓ.రమేష్ ధర్మసాగర్ నుంచి సీసీఆర్‌బీ వరంగల్, ఆడవెల్లి శ్రీనివాస్ వీఆర్ వరంగల్ నుంచి రఘునాథపల్లి సర్కిల్, ఆర్.సంతోష్ రఘునాథపల్లి సర్కిల్ నుంచి వరంగల్ పోలీస్ కంట్రోల్ రూం, పి.కిషన్ వీఆర్ వరంగల్ నుంచి సీఎస్‌బీ వరంగల్, కె.కుమారస్వామి వీఆర్ వరంగల్ నుంచి సీసీఆర్‌బీ వరంగల్, కె.శ్రీనివాస్ టాస్క్‌ఫోర్స్ నుంచి వీఆర్ వరంగల్ ఐటీ సెల్, పెండ్యాల్ దేవేందర్ కమిషనరేట్ నుంచి టాస్క్‌ఫోర్స్, జి.రాజశేఖర్‌రెడ్డి సిద్దిపేట కమిషనరేట్ నుంచి టాస్క్‌ఫోర్స్, ఎల్.పవన్‌కుమార్ ఆదిలాబాద్ నుంచి టాస్క్‌ఫోర్స్, ఎస్.రవికుమార్ ఖమ్మం కమిషనరేట్ నుంచి సీసీఎస్ వరంగల్, భూక్య శంకర్ సీసీఎస్ వరంగల్, ఎన్.చంద్రమోహన్ వీఆర్ వరంగల్ నుంచి సైబర్ క్రైం లకు బదిలీ అయ్యారు.

సబ్ ఇన్‌స్పెక్టర్లు..

మహేందర్ మామునూరు నుంచి జఫర్‌గఢ్, కె.శ్రవణ్‌కుమార్ కొత్తగూడెం జిల్లా నుంచి దేవరుప్పుల, ఎం.లింగారెడ్డి మహబూబాబాద్ జిల్లా నుంచి పాలకుర్తి ఎస్సై 2, టి.సుమన్ మిల్స్‌కాలనీ నుంచి సుబేదారి, ఎస్.డేవిడ్ వీఆర్ నుంచి హన్మకొండ ట్రాఫిక్, తౌటం శ్రవణి మిల్స్‌కాలనీ నుంచి పోలీస్ కంట్రోల్‌రూం, బండి హరికృష్ణ మిల్స్‌కాలనీ నుంచి ఘన్‌పూర్, వడ్డె సందీప్ పీసీఆర్ నుంచి హన్మకొండ పీఎస్, అనిల్ పీసీఆర్ నుంచి కేయూసీ, రాజిరెడ్డి మట్టెవాడ నుంచి వీఆర్, మున్సీరుల్లా హన్మకొండ నుంచి వీఆర్ వరంగల్, రుక్మాచారి జనగామ నుంచి వీఆర్ వరంగల్‌కు బదిలీ చేస్తూ సీపీ ఏవీ. రంగనాథ్ ఉత్తర్వులు జారీ చేశారు.

జనరల్ టికెట్‌తో రిజర్వేషన్ కోచ్‌లోకి..

- రైలులో ప్రయాణికుడి హల్‌చల్

కాజీపేట రూరల్: న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్ వెళ్లే తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైల్‌లో మంగళవారం ఓ ప్రయాణికుడు హల్‌చల్ చేశాడు. ఆగ్రాలో జనరల్ టికెట్ తీసుకొని తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్నాడు. మార్గమధ్యలో ప్యాంట్రీ కార్ కోచ్‌లోకి ప్రవేశించాడు. రిజర్వేషన్ కోచ్‌లోకి వచ్చిన నేపథ్యంలో జరిమానా చెల్లించాలని టీటీఈలు పేర్కొనగా వారిపై తిరగబడి న్యూసెన్స్ చేశాడు. దీంతో టీటీఈలు పోలీస్ కంట్రోల్ సమాచారం ఇచ్చారు. రైలు కాజీపేట జంక్షన్‌కు చేరుకోగానే సదరు ప్రయాణికుడిని ఆర్‌పీఎఫ్ సీఏ సంజీవరావుకు అప్పగించగా ఆయన పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

నీరు వెళ్లే దారేది?



చిన్నవడ్డేపల్లి చెరువు మత్తడి వద్ద మూసి ఉన్న తూము....పైనుంచి పోతున్న వరద నీరు

- గుడిసెలు వేసి అడ్డుగా మట్టి పోసి
- అవుట్ ఫ్లో లేక..ముంపులోనే కాలనీలు..
- పనిచేయని తూములు..
- పట్టించుకోని అధికారులు

వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో సైడ్‌కాల్వలు, కల్వర్టులు, బాక్స్ డ్రెయిన్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడంతో రెండేళ్ల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. రెండు వర్షాకాలాలు పోయినప్పటికి పనులు పూర్తి కాకపోవడంతో శివారు ప్రాంతమైన 14, 18వ డివిజన్‌లలో పలు కాలనీలు ఆదివారం నుంచి కురిసిన భారీ వర్షంతో జలమయమయ్యాయి.

గుడిసెలు వేసి.. అడ్డుగా మట్టి..

చిన్నవడ్డేపల్లి చెరువులో వామపక్ష పార్టీల అధ్వర్యంలో గుడిసెలు వేసిన వారు పై ప్రాంతాలనుంచి చెరువులోకి వచ్చే కాలువకు అడ్డంగా మట్టిపోయడంతో వర్షపు నీరు ఎక్కడిక్కడే నిలిచిపోయింది. గత వారం కమిషనర్ వచ్చి అడ్డుగా ఉన్న మట్టి తీయాలని ఆదేశించగా తూతూమంత్రంగా తీయడంతో మళ్లీ నీరు నిలిచింది. దీనికి తోడుగా వరద వచ్చినప్పుడు అదనంగా నీరు పోయేందుకు మత్తడిపై రెండు తూములు ఏర్పాటు చేశారు. ఈ తూములను ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఒక తూము పూర్తిగా మూసి ఉండడం కూడా కాలనీలు మునిగిపోయేందుకు కారణంగా భావిస్తున్నారు. ఒక తూము తీసినా పైనుంచి వచ్చే వరద మత్తడి పైనుంచి పోయింది. మరో తూము తీస్తే కాలనీలు మునక బారినుంచి బయటపడే అవకాశాలున్నాయి.

ఇన్‌ఫ్లో ఎక్కువ..అవుట్ ఫ్లో తక్కువ..

కాలనీల్లో పడిన నీరు పెద్ద మొత్తంలో బయటకు పోయే వీలు లేనందునే ముంపునకు గురువుతున్నాయి. నగరంలోని 18, 19, 14, 4వ డివిజన్లలో వర్షపు నీరు గరీబ్‌నగర్, 100ఫీట్లరోడ్డు, గాంధీనగర్, ఎస్ఆర్‌నగర్, లక్ష్మీగణపతికాలనీ, శ్రీసాయిగణేష్ కాలనీల మీదుగా చిన్నవడ్డేపల్లి చెరువులోకి వెళ్లాల్సి ఉంది. కానీ ఏనుమాముల రహదారి అడ్డంగా ఉండడం, నీరు వెళ్లేందుకు సరైన అవుట్ లెట్‌లను ఏర్పాటు చేయకపోవడం వల్ల పై కాలనీలు అన్ని రోజుల తరబడి ముంపులోనే ఉంటున్నాయి. కాశిబుగ్గ-ఏనుమాముల ప్రధాన రహదారి మధ్యలో రెండు చోట్ల అవుట్‌లెట్‌లు నిర్మించాల్సి ఉండగా తాగు నీటి పైపులైన్లు అడ్డుగా ఉన్న కారణంగా ఒకే చోట రెండు పైపులతో కల్వర్టులు నిర్మించినా వరద మాత్రం తగ్గలేదు. నాలుగు డివిజన్లలోని ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు ఒకేచోట నుంచి పోవడం వల్ల ఈపరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలో నీరు చెరువులోకి పోకపోవడంతో పెట్రోల్‌బంకు వరకు వరద నిలిచిపోయింది.



మళ్లీ మునిగిన 14వ డివిజన్‌లోని లక్ష్మీగణపతి, మధురానగర్ కాలనీలు

పైపులు వేయడంలో నిర్లక్ష్యం..



ఏనుమాముల బాలాజీనగర్-నర్సంపేటరోడ్డు వరకు ఉన్న 100ఫీట్ల రోడ్డు మధ్యలో పరిచిన పైపులు

నర్సంపేట రోడ్డు నుంచి ఏనుమాముల బాలాజీ జంక్షన్ వరకు నిర్మించిన స్మార్ట్ రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్ నిర్మించాల్సి ఉంది. కాంట్రాక్టర్ తన స్వలాభం కోసం డ్రెయిన్ స్థానంలో పైపులు వేసేందుకు మార్పులు చేయించుకున్నాడు. పైపులు రోడ్డు మధ్యలో స్టాక్ పెట్టి 6నెలలు దాటింది. వాటిని వేయాలని చెప్పే ధైర్యం అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు లేకుండా పోయింది. సదరు కాంట్రాక్టర్ అధికార పార్టీ ఎమ్మెల్యేకు సోదరుడు కావడమే కారణంగా తెలుస్తోంది. ఈ ఏరియా మరో ఎమ్మెల్యే పరిధిలో ఉన్నప్పటికి ఆయన కూడా చెప్పలేని స్థితిలో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయం ముంపు పరిశీలనకు వచ్చి మంత్రి దయాకర్‌రావు దృష్టికి తీసుకెళ్లగా మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

లైంగిక వేధింపులు..

- వివాహిత ఆత్మహత్య



మంజుల(ఫైల్)

వర్ధన్నపేట : లైంగిక వేధింపులతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు గ్రామానికి చెందిన పస్తం శ్రీనుకు 2006 సంవత్సరంలో మంజుల (34)తో వివాహం జరిగింది. బతుకుదెరువు నిమిత్తం 10 సంవత్సరాల క్రితం ముంబై వెళ్లిన దంపతులు.. మూడు నెలల క్రితం ఇంటికి చేరుకున్నారు. ఈక్రమంలో మండలంలోని ఎలికట్ట గ్రామం టిక్యతండాకు చెందిన జాటోత్ జితేందర్‌కు తమ ఇంట్లోని ఓ గదిని అద్దెకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జితేందర్ తరుచూ మంజులను లొంగదీసుకోవాలని యత్నించాడు. దీనిపై తొర్రూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు జితేందర్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా ఆయనలో మార్పు రాకపోవడంతో మరోసారి పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఈ వేధింపులు తాళ లేక మంజుల 15 రోజుల క్రితం తన సోదరి శారద ఇంటికి వెళ్లింది. అక్కడ మంజులకు మాయమాటలు చెప్పిన జితేందర్.. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని తన గదికి తీసుకెళ్లాడు. అక్కడ లైంగిక దాడికి యత్నించడంతో మంజుల ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా వరంగల్ ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. ఈ ఘటనలో లైంగిక వేధింపులు తట్టుకోలేక తన భార్య మంజుల ఆత్మహత్యకు పాల్పడిందని భర్త శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మహిళ బలవన్మరణం



నిఖిత మృతదేహం

వరంగల్ క్రైం : భర్తతో పాటు కుటుంబ సభ్యుల వేధింపులతో ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి న్యూశాయంపేటలోని బొల్లెనవాడకు చెందిన జంగ్లీ నిఖిత (21) ఈనెల 24న రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి యేసోబు ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త మహ్మద్ హసనుద్దీన్, కుటుంబ సభ్యులు సుల్తానా, కమాలుద్దీన్, యాకూబ్‌పై కేసు నమోదు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు.